
# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- మంచిర్యాల జిల్లాలో అభివృద్ధి పనులకు భూమిపూజ




మహిళా శక్తి పథకానికి ఊతం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే ముఖ్య లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన, హాజీపూర్ మండలం వేంపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్, ఆటోనగర్ స్థాపనకు భూమిపూజ చేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లిలో నిర్మించనున్న ఇందిరా మహిళా శక్తి సోలార్ ప్లాంట్‌కు భూమిపూజ చేశారు.

**ఆరోగ్య, విద్య రంగాల్లో ప్రాధాన్యత**

లక్సెట్టిపేట మండల కేంద్రంలో రూ.8.50 కోట్లతో ప్రభుత్వ నిధులు, మరో కోటి సింగరేణి నిధులతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించామని భట్టి విక్రమార్క చెప్పారు. మండలంలో రూ.10.20 కోట్లతో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలు నిర్మించామని తెలిపారు.

దండేపల్లి మండలం వెల్గనూర్‌లో 4 ఎకరాల్లో రూ.3 కోట్లతో సోలార్ ప్లాంట్ నిర్మించామని తెలిపారు. ఈ ప్లాంట్ రోజుకు 4,500–5,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, ఏడాదికి రూ.51 లక్షల ఆదాయం లభిస్తుందని చెప్పారు.

**కోటి మంది మహిళలకు కోటీశ్వరుల జీవితం**

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా 2 వేల మందికి ఉపాధి కలుగుతుందని, పరిశ్రమలు పెరుగుతాయని చెప్పారు. ఏడాదికి రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. తొలి ఏడాదిలో రూ.21,632 కోట్లు మంజూరు చేసినట్టు వివరించారు. ఆర్టీసీ బస్సులు, క్యాంటీన్లు, పాల డైరీలు, పెట్రోలు బంకులు, శక్తి భవనాలు, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు మహిళా సంఘాల ద్వారా ప్రోత్సాహం అందుతోందన్నారు.

**ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు**

ఈ సందర్భంగా అటవీ శాఖ నూతన వాహనాలను ప్రారంభించిన అధికారులు వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రులు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్టు వివరించారు.

**రైతులకు పెట్టుబడి సాయం**

రైతు కుటుంబాలకు తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందించామని, రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశామని తెలిపారు. 29 లక్షల పంప్ సెట్ల కోసం రూ.17 వేల కోట్లు ఖర్చు చేసినట్టు, 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి ప్రారంభించనున్నట్టు, నిరుద్యోగులకు యువ వికాసం పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తామని స్పష్టం చేశారు.

**జిల్లా అభివృద్ధి దిశగా అడుగులు**

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. లక్సెట్టిపేటలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల స్థాయిని పెంచిన తరువాత ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు.







# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

- రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి
- తలమడుగులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**శెనార్తి మీడియా, తలమడుగు :**

భారత రాజ్యాంగ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో తాటిపెల్లి వసంత్ రెడ్డి రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి, ఎంపీ గొడం నగేష్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వేడ్మ బొజ్జు పటేల్తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాల సంక్షేమ సంఘం సభ్యులు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని చాకలి ఐలమ్మ, కొమురం భీం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తలమడుగు గ్రామానికి చెందిన కాటిపెల్లి వసంత్ రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ విగ్రహాన్ని సొంత డబ్బులతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మండలంలోని పలు సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విగ్రహం ఏర్పాటు చేసిన దాతలను మంత్రి, ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలను మాల సంక్షేమ సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు దేవన్న, మాజీ ఎంపీపీ ఎలుగు చంటి, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, వసంత్ రెడ్డి, నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడె గజేందర్, గణేష్ రెడ్డి, గంగన్న, రమేష్, సంఘం సభ్యులు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# చిన్న బాబుకో రూల్.. నాకో రూలా..?



- తీరు మారకపోతే సీఎంకు ఫిర్యాదు చేస్తా..
- ఫారెస్ట్ అధికారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వార్నింగ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల (బెల్లంపల్లి):**

అటవీ శాఖ అధికారులపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పాత బెల్లంపల్లి గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆయన, అటవీ అధికారుల తీరును తీవ్రంగా విమర్శించారు. విద్యుత్ సాగు కోసం పత్తి రైతుల భూమిని ధ్వంసం చేయడం, పోడు భూములపై రైతులకు ఇబ్బందులు కలిగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగే విధంగా వ్యవహరించడం సరికాదని, ఇది ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఎన్నికల నియోజకవర్గంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను గట్టిగా హెచ్చరించారు. ''చిన్నబాబు (చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్) నియోజకవర్గంలో ఒక విధానం, బెల్లంపల్లిలో మరొక విధానమా?'' అంటూ ప్రశ్నించారు. అధికారులు తమ తీరు మార్చుకోకపోతే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. పోడు భూములపై ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అవసరమైతే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. రైతుల పంటలను నేరుగా ధ్వంసం చేయడం సరికాదని, ఇకపై అలాంటి చర్యలు సహించబోమని అన్నారు. ఇలాంటి చర్యల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇకపై అలాంటి సమస్యలు కలుగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గట్టిగా మందలించడంతో రైతులకు కొంత ఊరట కలిగింది.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**శెనార్తి మీడియా, నిర్మల్:** మండలంలోని బోంద్రట్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. ఎస్సై, బాధితులు తెలిపిన వివరాలు.. బోంద్రట్ గ్రామానికి చేందిన జంగ్మే సావిత్రిబాయి–నారాయణ దంపతులు ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఆరు గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి ఉండడం.. బీరువా తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై షేక్ జుబేర్ అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. బీరువాలో నగదుతో పాటు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

# ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలి




- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతికుమారి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ అమలు చేయాలని టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతికుమారి డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలో టీఎస్‌యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని ఇప్పటికీ నివేదిక విడుదల చేయకుండా వాయిదా వేయడం అన్యాయమని పేర్కొన్నారు.పీఆర్సీ నివేదికను తక్షణమే బహిర్గతం చేసి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.జిపిఎఫ్ లోన్స్, టిజిజిఎల్ఐ ఫైనల్ పేమెంట్స్, సరెండర్ లీవ్ బిల్లులన్నింటినీ త్వరగా చెల్లించాలన్నారు. 317 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉపాధ్యాయుల కోసం మెరుగైన హెల్త్ స్కీమ్ తీసుకురావాలని, కేజీబివి సిబ్బందికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రత్యేక వార్డెన్లు, కేర్ టేకర్లు నియమించాలని సూచించారు.పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, సర్దుబాటు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుండారపు చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు, జిల్లా ఉపాధ్యక్షుడు వి కిరణ్ కుమార్, కోశాధికారి బి కిరణ్, జిల్లా కార్యదర్శులు కె చంద్రమౌళి, జి నర్సయ్య, కమిటీ సభ్యులు టీ రమేష్, తిరుపతి, అశోక్, జైపాల్, దేవయ్య, పోచన్నలు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:** విద్యుదాఘాతానికి గురై బావునే అశోక్ (56) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన భోరజ్ మండలం పెండల్వాడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గౌతమ్ పవర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివేరాల ప్రకారం.. శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరు భోజనం చేసి పడుకున్నారు. అశోక్ ముందురూమ్‌లో పడుకున్నాడు. అశోక్ కుమారుడు రవి రాత్రి 11 గంటల సమయంలో బాత్‌రూం వెళ్లేందుకు నిద్ర లేచాడు. అశోక్ రెండు కాళ్లు కూలర్ స్టాండ్‌కు తగిలి ఉన్నాయి. అనుమానం వచ్చిన రవి కరెంట్ ఆఫ్ చేసి చూడగా అశోక్ కరెంట్ షాక్‌తో మృతిచెంది ఉన్నాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు.

## రిమ్స్ డైరెక్టర్‌కు ఐఎస్‌బీ సర్టిఫికెట్

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) సర్టిఫికెట్ అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాటు ఐఎస్ బీ కోర్సు నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లకు ఏడాది పాటు శిక్షణ ఇచ్చారు. ఆదిలాబాద్ రిమ్స్ నుంచి రిమ్స్ డైరెక్టర్ కోర్సును పూర్తి చేశారు. శిక్షణలో హెల్త్ కేర్ మేనేజ్ మెంట్ , నాణ్యమైన వైద్యసేవలు అందించడం తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో ఐఎస్ బీ ప్రొఫెసర్ సారంగ్ దేవ్ సర్టిఫికెట్ ను అందజేశారు.

ట్రాన్స్ జెండర్లకు ఉపాధి పునరావాసం కోసం

# దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్ ఖాన్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో పునరావాస పథకాన్ని అమలు చేస్తామని జిల్లా మహిళా, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ తెలిపారు. ఇందుకోసం అర్హులైన ట్రాన్స్ జెండర్ల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని చెప్పారు.డ్రైవింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగ్ తయారీ, టైలరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 23లోగా www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు. వివరాలకు 040-24559050 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

## టీ–గేట్ కమిటీ చైర్మన్‌గా గోవర్ధన్ రెడ్డి




**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించేందు కు టీ గేట్ (telangana Gateway for Adaptive Training & Employment) పథకాన్ని ప్రవేశపెట్టింది. అమలు కోసం జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ జిల్లా చైర్మన్‌గా బి.గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఏ.రాజేశ్వరమ్మ, కన్వీనర్‌గా పి.శ్రీనివాస్, కో కన్వీనర్‌గా ఆర్.శ్రీనివాస్, సభ్యులుగా మిల్కా, ముత్యంరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని పారిశ్రామిక అవసరాలను విశ్లేషించడంతో పాటు శిక్షణ–ప్లేస్‌మెంట్ వ్యూహాలను అమలు చేసేందుకు ఈ కమిటీ పనిచేయనుంది.




# స్వల్ప ఛేదనలో భారత్ తడబాటు



**లక్ష్యం 193.. ప్రస్తుతం 58/4**

**రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 192 ఆలౌట్**

**విజృంభించిన సుందర్**

లండన్ : భారత్-ఇంగ్లాండ్ మూడో టెస్టు రసవత్తర ముగింపు దిశగా సాగుతోంది. 193 పరుగుల చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. నాలుగో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి 58 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. రాహుల్ (33 బ్యాటింగ్‌బీ 47 బంతుల్లో 6ఐ4) పోరాడుతున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 2/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 192 పరుగులకే ఆలౌటైంది. వాషింగ్టన్ సుందర్ (4/22), సిరాజ్ (2/31), బుమ్రా (2/38) ఆతిథ్య జట్టు పతనాన్ని శాసించారు. రూట్ (40బీ 96 బంతుల్లో 1ఐ4) టాప్ స్కోరర్. చివరి రోజు తొలి గంటలో రాహుల్, పంత్ ఎలా ఆడతారన్నదే మ్యాచ్‌లో కీలకం కానుంది.

### ఛేదనలో తడబడ్డారిలా..

లక్ష్యం చిన్నదే అయినా.. ఛేదన అంత తేలిక కాదని భారత్‌కు త్వరగానే అర్థమైంది. ఇంగ్లాండ్ పేసర్లు పదునైన పేస్‌తో పరీక్షించారు. రెండో ఓవర్లోనే జైస్వాల్ (0)ను ఔట్ చేయడం ద్వారా ఆర్చర్ పతనాన్ని ఆరంభించాడు. ఇంగ్లిష్ బౌలర్లు ఇబ్బంది పెడుతున్నా రాహుల్, కరుణ్ నాయర్ (14) నిలవడంతో ఓ దశలో భారత్ 41/1తో కుదురుకున్నట్లే కనిపించింది. కానీ 17 పరుగుల వ్యవధిలోనే మూడు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. కార్స్ తన వరుస ఓవర్లలో కరుణ్, గిల్ (6)లను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌ను దెబ్బతీశాడు. నాలుగో రోజు ఆఖరి ఓవర్లో నైట్ వాచ్‌మన్ ఆకాశ్‌దీప్ (1)ను స్టోక్స్ బౌల్డ్ చేశాడు. ఆదివారం ఇంగ్లిష్ పేసర్లను ఎదుర్కొని నిలవడం భారత బ్యాటర్లకు సవాలే.

### మెరుగైన ఆరంభం

నాలుగో రోజును టీమ్‌ఇండియా గొప్పగానే ఆరంభించింది. పేసర్ సిరాజ్ విజృంభించడంతో లంచ్ వేళకు ఇంగ్లాండ్‌ను 98/4కు పరిమితం చేసి మెరుగైన స్థితిలో నిలిచింది. మూడో రోజు ఆఖరి ఓవర్ నాటకీయంగా సాగగా.. ఆదివారం కూడా మైదానంలో అదే తీవ్రత కనిపించింది. సిరాజ్‌తో కలిసి బౌలింగ్ దాడిని ఆరంభించిన బుమ్రా.. క్రాలీ (22)కి సమస్యలు సృష్టించాడు. భారత్‌కు వికెట్ దక్కడానికి ఎంతో సమయం పట్టలేదు. అయిదో ఓవర్లోనే డకెట్‌ను ఔట్ చేయడం ద్వారా సిరాజ్.. ఇంగ్లాండ్ పతనాన్ని ఆరంభించాడు. సిరాజ్ బంతిని పుల్ చేయబోయిన డకెట్ (12).. మిడాన్‌లో బుమ్రాకు చిక్కాడు. వికెట్ దక్కిన ఆనందంలో డకెట్‌ను చూస్తూ సిరాజ్ గట్టిగా అరిచాడు. డకెట్ అతణ్ని చూడకుండా వెళ్లిపోయాడు.. అంపైర్లు బౌలర్‌తో ఏదో మాట్లాడారు. సిరాజ్ కాసేపటి తర్వాత ఓలీ పోప్ (4)నూ ఔట్ చేసి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. లోపలికి సీమ్ అయిన బంతికి పోప్ వికెట్ల ముందు దొరికిపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు పడగొట్టిన నితీశ్‌కుమార్ రెడ్డిని బుమ్రా స్థానంలో బౌలింగ్‌కు దించాడు కెప్టెన్ గిల్. నితీశ్ తన రెండో ఓవర్లోనే ఫలితాన్నిచ్చాడు. అతడి ఫుల్ డెలివరీని డ్రైవ్ చేయబోయిన క్రాలీ.. ఎడ్జ్‌తో జైస్వాల్ చేతికి చిక్కాడు. క్రాలీ తొలి ఇన్నింగ్స్‌లోనూ నితీశ్ బౌలింగ్‌లోనూ ఔటయ్యాడు. 50/3తో ఇంగ్లాండ్ చిక్కుల్లో పడగా... బ్రూక్ (23)తో కలిసి రూట్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇద్దరూ ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. ఎటాకింగ్ గేమ్ ఆడిన బ్రూక్ చకచకా బౌండరీలు బాదాడు. కానీ ఈ భాగస్వామ్యం ఎంతో సేపు సాగలేదు. విరామానికి కాసేపటి ముందు బ్రూక్‌ను ఆకాశ్‌దీప్ ఔట్ చేసి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. స్ట్రెయిట్‌గా వచ్చిన ఫుల్ డెలివరీని స్వీప్ చేసే ప్రయత్నంలో అతడు బౌల్డయ్యాడు.




### తిప్పేసిన సుందర్

రూట్, స్టోక్స్ క్రీజులో పాతుకుపోయారు. భారత బౌలర్లను పరీక్షిస్తున్నారు. ఎలాంటి రిస్క్‌లకు పోకుండా ప్రశాంతంగా బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబడుతున్నారు. చిన్న అవకాశం కూడా ఇవ్వట్లేదు. అప్పుడప్పుడు బంతి అనూహ్యంగా వస్తున్నా.. బ్యాటర్లు క్రీజులో సౌకర్యంగానే కదులుతున్నారు. స్పిన్నర్లు, పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటున్నారు. క్రమంగా ఇంగ్లాండ్ స్కోరు 150 దాటింది. ఆ జట్టు మంచి స్కోరుపై కన్నేసింది. లంచ్ తర్వాత పరిస్థితి ఇది. పరిస్థితి భారత్‌కు ప్రతికూలంగా మారుతున్నట్లనిపించిన వేళ.. వికెట్ పోకుండానే ఆ జట్టు సెషన్‌ను ముగిస్తుందేమో అనిపించింది. కానీ వాషింగ్టన్ సుందర్ మ్యాచ్ గమనాన్ని మార్చేశాడు. అద్భుత బౌలింగ్‌తో చకచకా వికెట్లు పడగొట్టి టీమ్‌ఇండియాకు ఊపునిచ్చాడు. ముందు అతడు రూట్‌ను ఔట్ చేయడం ద్వారా ప్రమాదకర భాగస్వామ్యాన్ని విడదీశాడు. సుందర్ బంతిని స్వీప్ చేయడంలో విఫలమై రూట్ బౌల్డ్ కావడంతో 67 పరుగుల అయిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. భారత్‌కు అత్యవసరమైన వికెట్ అది. సుందర్ కాసేపటి తర్వాత వికెట్‌కీపర్ బ్యాటర్ జేమీ స్మిత్ (8)ను కూడా బౌల్డ్ చేశాడు. స్మిత్ ఈ సిరీస్‌లో కీలక సమయంలో కీలక ఇన్నింగ్స్‌లతో భారత్‌ను విసిగించిన సంగతి తెలిసిందే. కాస్త ఆలస్యమైనా రెండు వికెట్లు దక్కడంతో టీమ్‌ఇండియా సంతృప్తిగానే టీ విరామానికి వెళ్లింది. విరామం తర్వాత స్టోక్స్ (33)ను సుందర్ బౌల్డ్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కార్స్ (1)ను బుమ్రా ఔట్ చేశాడు. బుమ్రా తన తర్వాతి ఓవర్లో వోక్స్ (10)ను వెనక్కి పంపాడు. బషీర్ (2)ను సుందర్ ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. సుందర్ ఔట్ చేసిన నలుగురూ బౌల్డే కావడం విశేషం. ఇంగ్లాండ్ 38 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లు చేజార్చుకుంది.

RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in